సభ విశ్వాసం ఉన్నంత వరకే ప్రభుత్వం మనుగడలో ఉంటుంది. ఈ తరహా వ్యవస్థలో రాజ్యాధిపతి (రాష్ట్రపతి) నామమాత్రపు అధికారాలనే కలిగి ఉంటాడు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి విశేషమైన అధికారాలు ఉంటాయి. కానీ, వాస్తవంలో మాత్రం అధికారాలు ప్రధానమంత్రి నేతృత్వంలోని మంత్రిమండలికి ఉంటాయి. ప్రధానమంత్రి, మంత్రిమండలి సలహా మేరకే రాష్ట్రపతి నడుచుకుంటాడు.

**సమాఖ్య వ్యవస్థ**

భారతదేశం సమాఖ్య విధానాన్ని అనుసరిస్తున్నది. సమాఖ్య వ్యవస్థలో రెండు స్థాయుల్లో ప్రభుత్వాలు ఉంటాయి. దేశం మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉంటుంది. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఉంటాయి. ప్రస్తుతం మనదేశంలో 28 రాష్ట్రాలు ఉన్నాయి. మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో... ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్ముకశ్మీర్‌లలో కూడా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. అయితే భారత రాజ్యాంగంలో ఎక్కడా 'సమాఖ్య' (ఫెడరల్) అనే పదాన్ని వాడలేదు. మొదటి అధికరణంలో మాత్రం 'ఇండియా దట్ ఈజ్ భారత్... యూనియన్ ఆఫ్ స్టేట్స్' అంటే రాష్ట్రాల సమాహారంగా పేర్కొన్నారు. దీని గురించి వివరిస్తూ డాక్టర్ అంబేద్కర్... ''మనదేశం రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కారణంగా ఏర్పడలేదు. మన అవసరాల కొద్దీ దేశ భూభాగాన్ని రాష్ట్రాలుగా విభజించుకున్నాం. ఏ రాష్ట్రానికీ దేశం నుంచి విడిపోయే హక్కు లేదు. అయితే రాష్ట్రాలను మాత్రం పరిస్థితులను బట్టి విభజించే హక్కు కేంద్రానికి ఉంది'' అని పేర్కొన్నారు.

**అధికారాల విభజన**

రాజ్యాంగంలో ఏడో షెడ్యూల్‌లో కేంద్రం, రాష్ట్రాల మధ్య అధికారాల విభజన ఉంది. కేంద్ర జాబితాలో పేర్కొన్న అంశాలపై చట్టాలు చేసే అధికారం కేంద్రానికి మాత్రమే ఉంటుంది. రాష్ట్ర జాబితాలో పేర్కొన్న వాటిపై రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసుకోవచ్చు. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ చట్టాలు చేసుకోవడానికి ఉమ్మడి జాబితా కూడా ఉంది. అయితే వీటిపై కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తితే కేంద్ర ప్రభుత్వ చట్టమే చెల్లుబాటు అవుతుంది. ఇక ఏ జాబితాలోనూ పేర్కొనని అంశాలపై చట్టాలు చేసే అధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికే ఉన్నది.

**ఒక్కటే పౌరసత్వం**

సమాఖ్య తరహా దేశాల్లో రెండు పౌరసత్వాలు ఉంటాయి. ఒకటి దేశ పౌరసత్వం. ఇంకొకటి పౌరుడు నివాసం ఉండే రాష్ట్రానికి సంబంధించింది. కానీ, భారతదేశంలో మాత్రం రాష్ట్రాలకు విడిగా పౌరసత్వం ఉండదు. ఏ రాష్ట్రంలో ఉన్నా భారత పౌరులే.

**సార్వత్రిక వయోజన ఓటుహక్కు**

భారత ప్రజాస్వామ్యం 'ఒక వ్యక్తి– ఒక ఓటు' ప్రాతిపదికన పనిచేస్తుంది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయుడు ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హుడే. అలా సార్వత్రిక వయోజన ఓటు హక్కు ద్వారా భారత రాజ్యాంగం రాజకీయ సమానత్వానికి పెద్దపీట వేసింది. అయితే, రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు 21 ఏండ్లు నిండిన వారికే ఓటుహక్కు ఉండేది. దాన్ని 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 1989లో 18 ఏండ్లకు తగ్గించారు. కాగా, దేశంలో ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగ అధికరణం 324 ప్రకారం 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పాటైంది. అందుకే జనవరి 25ను 'జాతీయ ఓటర్ల దినోత్సవం'గా జరుపుకొంటున్నారు.




**ఏకీకృత, స్వతంత్ర న్యాయవ్యవస్థ**

భారత రాజ్యాంగం సమగ్రమైన స్వతంత్ర న్యాయవ్యవస్థను ఏర్పాటుచేసింది. సుప్రీంకోర్టు అత్యున్నత స్థాయిలో ఉంటుంది. రాష్ట్రాల్లో హైకోర్టులు మధ్య స్థాయిలో ఉంటాయి. ప్రస్తుతం దేశంలో 25 హైకోర్టులు పనిచేస్తున్నాయి. హైకోర్టుల పరిధిలో జిల్లా స్థాయి, ఇంకా దిగువ స్థాయి న్యాయస్థానాలు ఉంటాయి. ప్రాథమిక హక్కులకు ప్రమాదం ఏర్పడితే నేరుగా సుప్రీంకోర్టుకు వెళ్లవచ్చు. అంతేకాకుండా మన రాజ్యాంగానికి సుప్రీంకోర్టు సంరక్షకురాలిగా వ్యవహరిస్తుంది. చట్టపరమైన సమస్యలు తలెత్తినప్పుడు రాజ్యాంగానికి సుప్రీంకోర్టు వ్యాఖ్యానం చెబుతుంది. అలా సుప్రీంకోర్టు మన రాజ్యాంగానికి పరిరక్షణకర్తగా భావించవచ్చు.

**ప్రాథమిక హక్కులు**

రాజ్యాంగంలో మూడో భాగంలో ప్రాథమిక హక్కులను పొందుపరిచారు. ఇవి ప్రతి పౌరుడూ సహజంగా అనుభవించాల్సినవి అన్నమాట. వీటిని రాజ్యాంగంలో 12వ అధికరణ నుంచి 35 వరకు పేర్కొన్నారు. మొత్తం ఆరు రకాలైన ప్రాథమిక హక్కులు రాజ్యాంగంలో ఉన్నాయి. అవి.

**సమానత్వపు హక్కు:** ఇవి దేశ పౌరులందరికీ సమాన అవకాశాలను ప్రసాదిస్తున్నాయి. అంటరానితనాన్ని నిషేధించాయి. భారతరత్న, పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సైనిక గౌరవాలు తప్ప ఇతర బిరుదులను రాజ్యాంగం నిషేధించింది.

**స్వాతంత్ర్యపు హక్కు:** 19 నుంచి 22 అధికరణల్లో దీని గురించి ప్రస్తావించారు. దేశంలో ఎక్కడైనా తిరగడానికి, నివసించడానికి, నచ్చిన వృత్తిని చేపట్టడానికి, ఆయుధాలు లేకుండా సభలు, సమావేశాలు జరుపుకోవడానికి, సంఘాలు ఏర్పాటు చేసుకోవడానికి స్వేచ్ఛ ఉంది. 23, 24 అధికరణలు అన్ని రకాల పీడనల నుంచి ప్రజలకు విముక్తిని ప్రసాదించాయి. 25, 26, 27, 28 అధికరణల్లో మత స్వాతంత్ర్యం గురించి పేర్కొన్నారు. నచ్చిన మతాన్ని ఆచరించి, ప్రచారం చేసుకునే స్వేచ్ఛ ఉంది. 29, 30 అధికరణల్లో విద్య, సంస్కృతికి సంబంధించిన రక్షణలు కల్పించారు. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగితే నేరుగా సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశాన్ని 32వ అధికరణం ఇస్తున్నది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దీన్ని 'రాజ్యాంగానికి ఆత్మ' అని పేర్కొన్నారు.